
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం 8 నవంబరు 2025

నేటి నుంచి 69వ రాష్ట్రస్థాయి అండర్-17
కబడ్డీ పోటీలు
- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న మంత్రులు, అధికారులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

6

భద్రాద్రి పాలకమండలి.. కూర్పుపై

సర్వత్రా ఆసక్తి

- అభివృద్ధి, నిస్వార్థంగా సేవ చేసే వారికి అవకాశమివ్వాలని ఆకాంక్ష
- ఏడాది తరువాత రెండోసారి ప్రకటనజారీతో పలువురిలో రేకెత్తిన ఆశలు

భద్రాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రం సీతారామచంద్రస్వామి దేవస్థానం పాలక మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే పాలక మండలిలో భక్తి, ఆధ్యాత్మిక భావాలతో పాటు అభివృద్ధి, సేవలందించడంలో నిస్వార్థంగా ఉండే వారికి ప్రాధాన్యమివ్వాలని.. అప్పుడే ఆలయ అభివృద్ధి సాధ్యమవుతుందని రామ భక్తులు అభి ప్రాయపడుతున్నారు. ఇదే సమయంలోవివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులకే పాలక మండలిలో చోటు కల్పించాలని శ్రీరామ భక్తులు, భద్రాద్రి వాసులు కోరుతున్నారు. రాజకీయ పునరావాస కేంద్రంగా కాకుండా దేవస్థానం ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా కూర్పు ఉండాలని కోరుకుంటున్నారు. ఎంతో చరిత్ర కలిగిన భద్రాద్రి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు నిత్యం

(మిగతా 6వ పేజీలో)

కలియుగ వైకుంఠంగా.. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం క్షేత్రం.. ఆ వేంకటేశ్వర స్వామివారు సాలగ్రామ శిలా రూపంలో స్వయంభువుగా వెలిసిన మహా పుణ్య క్షేత్రంగా చరిత్రపుటల్లో నిలిచింది. అయితే ఎంతో మహిమాన్వితుడైన జమలాపురం శ్రీవారిపై భక్తితో చాలామంది దేవాలయానికి అప్పట్లో భూములను దానం చేశారు. ఆ క్రమంలో దేవాలయానికి సుమారు 58ఎకరాల భూమి సమకూరింది. ఆ భూమిని మాన్యంగా భావించి సాగు చేసిన వారు ఇచ్చే ఆదాయంతో కైంకర్యాలు జరిగేవి. కానీ కాలక్రమంలో దేవాదాయశాఖ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వాన్ని అదునుగా చేసుకుని ఆ దేవుడి భూముల్లో కొందరు దేవాంతకులు పాగా వేశారు.



దేవుడి భూముల్లో.. దేవాంతకులు!

- జమలాపురం శ్రీవారి మాన్యం అన్యాక్రాంతం
- కబ్జాకోరల్లో రూ.కోటి విలువైన భూమి
- ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్నా పట్టించుకోని దేవాదాయశాఖ


అన్యాక్రాంతమైన శ్రీవారి భూములు

ఎర్రుపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమలాపురం శ్రీవారి ఆలయం కింద సుమారు 58 ఎకరాల భూమి ఉండగా.. దానిలో 32.21 ఎకరాలు వ్యవసాయభూములు కాగా.. 25.17ఎకరాల విస్తీర్ణంలో దేవాలయం ఉంది. మామునూరు రెవెన్యూ పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో సర్వే నెంబరు 421లో అదే గ్రామానికి చెందిన ముష్టి లక్ష్మీనర్సింహశాస్త్రి అనే భక్తుడు 1938లో శ్రీ అలివేలుమంగా అమ్మవారికి పసుపుకుంకుమ కింద 10.33ఎకరాల భూమిని ఆలయానికి దానం చేశారు. అధికారికంగా 9.13ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనినిప్రతి 3 ఏళ్లకోసారి వేలంపాట నిర్వహించి కౌలు వ్యవసాయానికి కేటాయిస్తారు. దీని ద్వారా ఏటా రూ.30వేల ఆదాయం వస్తుంది. కాగా దేవాలయ అధికారుల నిర్లక్ష్యాన్ని అదునుగా చేసుకుని ఈభూమిని కొన్నేళ్లగా కొందరు కబ్జా చేసుకుని ఏకంగా మామిడిమొక్కలు వేసి భూమిని అనుభవిస్తున్నారు. కబ్జాదారుల కోరల్లో సుమారు 4 నుంచి 5 ఎకరలు భూమి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సదరు భూమి ప్రైవేటు మార్కెట్‌లో ఎకరం రూ.25లక్షలు అంటే మొత్తం దాదాపుగా రూ.కోటి విలువగల దేవాలయ భూమి దేవాంతకుల చేతిలో ఉందని దాతలు, వారి వారసులు చెబుతున్నారు. కాగా దేవాలయ భూములు నుంచికౌలు ద్వారా ఏటా రూ.2,36,900 ఆదాయం వస్తుంది. శ్రీవారికి చెందిన 21 ఎకరాల భూమి దస్త్రాల రూపంలో మాత్రమే ఉంది తప్పా రెవెన్యూ రికార్డుల్లోకి పునరుద్ధరించకపోవడం దేవాదాయశాఖ అలసత్వానికి నిదర్శనంగా కనిపిస్తోంది. దేవాలయ అధికారులు మొద్దునిద్రను వీడి సర్వేనిర్వహించి కబ్జా భూమిని లాక్కుని సరిహద్దులు నిర్ణయించి శ్రీవారి భూములను కాపాడాలని దాతల వారసులు కోరుతున్నారు.

ఆలయ ప్రాంగణానికీ తప్పని కబ్జా పోటు

తెలంగాణ దేవాదాయ భూముల రక్షణకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ఎండోమెంట్ యాక్ట్ 1987 చాప్టర్ 11సవరణకు ఇప్పటికే కసరత్తు పూర్తిచేసింది. 83, 84 సెక్షన్లను తొలిగించాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈమేరకు బిల్లు ప్రవేశపెట్టనుంది. ట్రిబ్యునల్, కోర్టు కేసులతో దర్జాగా వేల ఎకరాలు కబ్జా చేస్తున్న వాళ్ల ఆటకట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంగల జమలాపురం శ్రీవారి ఆలయ ప్రాంగణం కూడా కబ్జాకోరల్లో చిక్కుకుంటోంది. దశబ్దాలకాలం నుంచి రాజకీయ నాయకుల ప్రోద్బలం, ఆలయ కార్యనిర్వాహణాధికారుల ఉదాసీనత కారణంగా ప్రాంగణానికి ఆనుకుని సుమారు

(మిగతా 8వ పేజీలో)


గోపాలదేవబోయినపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

గన్నీసంచుల్లేక..

- ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- కాంటాలకు సిద్ధంగా వేలాది బస్తాల పంట
- వాన నుంచి రక్షణకు పట్టాల కొరత
- ఆందోళన చెందుతున్నరైతులు

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో పండిన అయిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు కాలం కలిసిరావడం లేదు. ఇప్పటికే వర్షాలతో బెంబేలెత్తిపోయిన వారికి.. చేతికొచ్చిన పంటను అమ్ముకునే సమయంలోనూ కష్టాలు తప్పడం లేదు. పక్షం రోజుల క్రితం జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచులు అందుబాటులోలేని పరిస్థితి. దీంతో కల్లూరు మండలం గోపాలదేవబోయినపల్లి గ్రామంలో శుక్రవారం కొనుగోళ్లు నిలిచిపోగా.. బాధిత రైతులు ఆందోళనకు దిగారు. యంత్రాలతో కోసిన వేలాది బస్తాల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్న క్రమంలో గన్నీ సంచుల కొరత రావడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండలంలో సుమారు 34 వేలకు పైగా ఎకరాల్లో ఈ వానాకాలం సీజన్‌లో వరి వేశారు. మండలంలోని గోపాలదేవబోయినపల్లి, యర్రబోయినపల్లి, లింగాల, చెన్నూరు, చంద్రుపట్ల తదితర గ్రామాల్లో ముందుస్తుగానే వరి కోతలు ప్రారంభమయ్యాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో వరి నేల కొరిగి నష్టం వాటిల్లగా.. కనీసం పెట్టుబడులైన రాబట్టుకోవాలనుకున్న రైతలకు నిరాశే మిగులుతోంది. మండలంలో డీసీఎంస్, ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో సుమారు 31 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. గోపాలదేవబోయినపల్లిలోనే సుమారు వెయ్యి ఎకరాల్లోని పంట సిద్ధంగా ఉంది. దీనికి సుమారు 50వేలకు పైగా గన్నీసంచుల అవసరం ఉండగా.. 5వేల గన్నీ సంచులు మాత్రమే రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా కొనుగోలులో జాప్యం జరిగి మళ్లీ వర్షాలు పడితే తమ పరిస్థితేంటని, కప్పడానికి పట్టాలు కూడా అందుబాటులో లేవని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు ప్రక్రియను వేగంగా సాగేలా అవసరమైన మేరకు గన్నీసంచులతో పాటుగా రక్షణ కోసం పట్టాలు సరఫరా చేయాలని రైతులు, సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌రావు డిమాండ్ చేశారు.

గన్నీసంచులు అందించాలి

అజ్మీర విజయ్‌కుమార్, కౌలు రైతు, గోపాలదేవబోయినపల్లి



ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలన్న గంపెడాశతో ఉన్నాం. ఇందుకోసం ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించిగా గన్నీసంచులు లేక నానా అవస్థలు పడుతున్నాం. సంచుల కొరత తీవ్రంగా ఉంది. నేను పదెకరాల్లో వరి వేశా. పంటను అమ్ముదామంటే గన్నీసంచులు ఇవ్వటానికి అధికారులు నిరాకరిస్తున్నారు. కౌలు రైతులకు కూడా గన్నీసంచులివ్వాలి.

వివరాల అందజేతలో
క్రీడా సంఘాల నిర్లక్ష్యం

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆదేశాల ప్రకారం జిల్లా క్రీడల శాఖకు వివరాలు అందజేయడంలో జిల్లాలోని క్రీడా సంఘాల నిర్లక్ష్యంగా ఉన్నట్టుకనిపిస్తోంది. శుక్రవారం వరకు వివరాలు అందించాల్సి ఉండగా ఖమ్మం జిల్లాకు సంబంధించి కేవలం ఆర్చరీ, స్కేటింగ్, ఉషూ, టేబుల్‌టెన్నీస్ ఈ నాలుగు అసోసియేషన్లు మాత్రమే తమ వివరాలు అందించినట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో సుమారు 35వరకు గుర్తిం పు పొందిన సంఘాలుండగా వాటిలో కేవలం నాలుగు సంఘాలే వివరాలు అందించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మిగితా అసోసియేషన్ల బాధ్యులు తమ వివరాలు అందించడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. స్టేడియం కార్యాలయం నుంచి సదరు క్రీడా సంఘాలకు ఫోన్లు చేయగా.. తాము వివరాలు అందించడానికి సోమవారం వరకు సమయం ఇవ్వాలని కోరినట్టు అధికారులు తెలిపారు.

కాగా సోమవారం వరకు వివరాల సమర్పణకు గడువిచ్చామని ఆ రోజు కూడా వివరాలు తెలపక పోతే సదరు సంఘం గుర్తింపు కోల్పోతుందని డీవైఎస్‌వో తెలిపారు.

గుండెల నిండుగా...

- జిల్లా వ్యాప్తంగా సామూహికంగా వందేమాతరం ఆలాపన
- ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాల నిర్వహణ


కలెక్టరేట్‌లో వందేమాతరం ఆలపిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ గేయమైన వందేమాతరాన్ని బంకిం చంద్ర చటర్జీ రచించి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిల్లా ప్రజలంతా తమ గుండెల నిండుగా వందేమాతర గేయాన్ని ఆలపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు సామూహిక గేయాలాపన కార్యక్రమం జరగ్గా.. శుక్రవారం ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో పాటు జిల్లా అధికారులు గేయాలాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటితో 150 ఏళ్ల పూర్తయ్యాయన్నారు. ఈ గీతం దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకని, ప్రతి ఒక్కరూ ఈ భావనను మనసులో నిలుపుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. పలు కూడళ్లలో పౌరులు కూడా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉత్సాహంగా గురుకులాల
జోనల్ క్రీడలు

వైరా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మూడురోజులపాటు నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల 11వ భద్రాద్రి జోనల్ స్థాయి క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అండర్-14, 17 విభాగాల్లో జరుగుతున్న ఈ క్రీడల్లో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని 14గురుకులాల నుంచి దాదాపు 1,190 మంది పాల్గొన్నారు. ఈ క్రీడలు శనివారంతో ముగియనుండగా మొదటి, రెండో రోజు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురుకులాల జోనల్ అధికారి ఎస్.విద్యారాణి, వైరా గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత, గురుకులాలల ప్రిన్సిపాళ్లు బహుమతులు అందజేశారు.


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

రెండ్రోజుల్లో జరిగిన క్రీడల విజేతలు వీరే..

అండర్-14 విభాగంలో...

- 200మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి(వైరా), ఏ.ఏంజెల్(టేకులపల్లి), పి.సవ్రంతి(కల్లూరు) సాధించారు.
- 400మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి(వైరా),పి.స్రవంతి(కల్లూరు), జె.కావ్యశ్రీ (వైరా)
- 600మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా పి.స్రవంతి(కల్లూరు), సీహెచ్.మహాలక్ష్మీ(ఇల్లందు), ఏ.లక్ష్మీత్రివేణి(వైరా)
- షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా డి.భవ్యశ్రీ(అడవిమల్లెల), ఎస్.భార్గవి(వైరా), వి.మేఘవర్షిత(కూసుమంచి)
- లాంగ్‌జంప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఏ.లక్ష్మీ త్రివేణి(వైరా), ఎస్.భార్గవి(వైరా, కె.నవ్య(ఇల్లందు)
- చదరంగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా షణ్ముఖ(ఎర్రుపాలెం), కె.వర్షిత(ఇల్లందు), జి.హర్షిత(అడవి మల్లెల)
- క్యారమ్స్ డబుల్స్ ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా పి.సు కయ్య, స్వర్ణమనీషా(కూసుమంచి), ఎస్.వింధ్య, ఎం.ప్రణీత(ఎర్రుపాలెం)

అండర్-17 విభాగంలో...

- 200మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టీ.రేష్మ(వైరా), సీహెచ్.వెన్నెల(ఇల్లందు), జి.మంజుని(కల్లూరు) సాధించారు.
- 400మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టీ.రేష్మ(వైరా), సీహెచ్.వెన్నెల (ఇల్లందు), ఎం.హర్షిని(మధిర)
- 1500మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా కైలా సాయిశ్రీ(ముల్కలపల్లి), టీ.మాన(ఇల్లందు), పి.హర్షిత(మధిర)
- 3000మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా అఖిల సాయిశ్రీ(ములకలపల్లి), మానస(ఇల్లందు), ఏ.సాక్షిత(ములకలపల్లి)
- షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.ఉమారాణి(అడవిమల్లెల), డి.స్వాతి(కూసుమంచి),ఏ.సంజన(ఎర్రుపాలెం)
- లాంగ్‌జంప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా వెన్నెల(ఇల్లందు),టి.రేష్మ(వైరా),ఎం.హర్షిని(ఇల్లందు)
- చదరంగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా జి.హర్షిత(అడవిమల్లెల), సౌమ్యశ్రీ(నేలకొండపల్లి)
- క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా డి.హర్షిత, సాత్విక(కల్లూరు, భద్రాచలం) ఉన్నారు.

మరిపెడలోనూ హోరాహోరీగా

మరిపెడ : మహబూబాబాద్ జిల్లా మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలోనూ భద్రాద్రి మల్టీజోన్ క్రీడా, స్పోర్ట్స్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. రెండో రోజు ఆటలు ముగిసే సమయానికి రన్నింగ్, హైజంప్, క్యారమ్స్, చెస్ పోటీలలో వివిధ గురుకుల స్కూల్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రెండో రోజు ఆటలు ముగిసేసరికి అండర్ 14 చెస్ పోటీలలో మరిపెడ, నర్సంపేట, పాల్వంచ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్ 17లో పాల్వంచ, దమ్మపేట, అండర్ 19 విభాగంలో పాల్వంచ, ముదిగొండ విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఎం.నిఖిల్ (మణుగూరు), ఆర్.సాంబశివ (మరిపెడ), టి.సన్నీ (వర్ధన్నపేట), అండర్ 17 విభాగం 1500 మీటర్ల రన్నింగ్ పోటీలలో వి.రాహుల్ (పాల్వంచ), ఎం.బన్నీ (దమ్మపేట), ఆర్.లోకేశ్ (పాల్వంచ), అండర్ 19లో మాధవ్ (పాల్వంచ), జె.గౌతమ్ (దమ్మపేట), టి.కార్తీక్ (పాల్వంచ) గురుకుల స్కూల్స్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. క్యారమ్స్‌లో పాల్వంచ, మరిపెడ విద్యార్థులు గెలుపొందారు.

అటవీశాఖలో అమ్మ ఆవేదన!

- కేర్‌టేకర్‌తో చిన్నారిని అనుమతించని అటవీశాఖ అధికారి
- సోమవారం నుంచి వసతి కల్పిస్తామన్న డీఎఫ్‌వో సిద్దార్థ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలానికి తగినట్టుగా.. పెరిగిన ఖర్చులను తట్టుకునేందుకు భార్యాభర్త ఇద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో కార్పొరేట్ సంస్థలు మొదలు చిన్నపాటి ప్రైయివేట్ కంపెనీల వరకు చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాయి. కనీసం ఏడాది వరకు ఉద్యోగం చేస్తూనే పిల్లలను అందుబాటులో ఉంచే వెసులుబాటు కూడా కల్పిస్తున్నారు. ఇక ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌లో కూడా ఉద్యోగుల పిల్లల కోసం ఒక అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఓ చంటిపాప విషయంలో అటవీశాఖ జిల్లా కార్యాలయంలోని డివిజన్ మహిళా అధికారి తీరు ఇప్పుడు ఆశాఖలోని ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. డివిజన్ స్థాయి కార్యాలయంలోని ఓ మహిళ ఉద్యోగి బిడ్డకు జన్మనివ్వగా.. ఆరు నెల ల ప్రసూతి సెలవుల తర్వాత ఆమె ఉద్యోగంలో చేరారు. అయితే తన చిన్న బిడ్డతో పాటుగా ఒక కేర్ టేకర్‌ను ఆఫీస్‌కు తీసుకొని వచ్చారు. ఇంకే ముంది వెంటనే డివిజన్ మహిళా అధికారికి కోపం వచ్చింది. పసిపాపలను కార్యాలయానికి తీసుకరావొద్దని తోటి ఉద్యోగుల ఎదుటే తేల్చిచెప్పడంతో .. ఆ కేర్‌టేకర్ ఉసూరుమంటూ బిడ్డను తీసుకుని ఇంటికి వెళ్లింది. ఇలా రెండు రోజులుగా ఆ బిడ్డను అనుమతించకపోవడంతో తల్లి మనోవేదనతోనే బిడ్డను ఇంటి వద్దనే వదిలి ఉద్యోగానికి వస్తున్నారు. కాగా ఈ విషయంపై జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సోమవారం నుంచి మహిళ ఉద్యోగితో పాటు చిన్నారి ఆలనాపాలనా చూసుకునేందుకు ప్రత్యక సౌకర్యం కల్పిస్తామన్నారు.

9న ఈస్థటిక్స్ ఆధ్వర్యంలో సాహితీ అవార్డులు


మాట్లాడుతున్న రవిమారుత్

ఖమ్మంఖానాపురంహవేలీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగులో సాహిత్య సృజనను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఖమ్మం జిల్లాలో సాహిత్య వాతావరణాన్ని పెంపొందించే లక్ష్యంతో ఖమ్మం ఈస్థటిక్స్ కవిత్వం, కథారచనా విభాగాలలో అవార్డులను అందిస్తున్నట్లు నిర్వాహకులు రవిమారుత్ తెలిపారు. శుక్రవారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఉత్తమ కవితాసంపుటికి రూ.40 వేల రూపాయల నగదు బహుమతి, ఉత్తమ కథలకు ప్రథమ బహుమతి రూ.25 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.15వేల, తృతీయ బహుమతి రూ.10వేలు అందిస్తున్నామన్నారు. ఈ నెల 8,9 తేదీలో నగరంలోని సెడార్వ్యాలీ పాఠశాలలో కథాంతరంగం సదస్సు నిర్వహించి 9వ తేదీ సాయంత్రం నగరంలోని జడ్పీ మీటింగ్ హాల్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని అన్నారు.

వందలాది కథలు.. కవితలు..

ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పోటీకి కథలను, కవిత్వ సంపుటాలను ఆహ్వానించగానే స్పందించిన తెలుగు కవులకు, కథకులకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 90కిపైగా కవితా సంపుటులు, 140 కి పైగా కథలు వచ్చాయన్నారు. కమిటీ అభ్యర్థన మేరకు కవిత్వానికి ముగ్గురు, కథలకు ముగ్గురు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని అన్నారు. కవిత్వం విభాగంలో పలమనేరు బాలాజీ కవితా సంపుటి లోపలేదో కదులుతున్నట్లుందికి రూ.40 వేల రూపాయల బహుమతిని గెలుచుకుందని, మరో ఇద్దరికి ప్రత్యేక ప్రశంసగా అవార్డులు ఇవ్వాలని కమిటీ నిర్ణయించిందని, రేణుక అయోల కవిత సంపుటి రవిక, పాయల మురళీకృష్ణ గచ్చం చెట్టుకు ఎంపికయ్యారన్నారు.

ఉత్తమ రచనల ఎంపిక

కథల విభాగంలో ఉత్తమ కథగా వీఆర్ రాసాని తెనెకల్లుకు రూ.25వేల బహుమతి, ద్వితీయ ఉత్తమ కథగా ఆలూరి అరుణ్‌కుమార్ రూ.15వేలు, తృతీయ ఉత్తమ కథగా యాములపల్లి నర్సిరెడ్డి, అంజమ్మకు రూ.10వేల బహుమతిని గెలుచుకున్నాయన్నారు. బహుమతులు గెలుచుకున్న కథలతో సహా పోటీకి వచ్చిన కథలలో పన్నెండు కథలను ఒక సంపుటిగా ప్రచురించాలని ఖమ్మం ఈస్థటిక్స్ నిర్ణయించామన్నారు నవంబరు 9న ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రధాన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందించటం జరుగుతుందన్నారు. ఎం. సుగుణాకర రావు అప్పో దీపోభవ, సుంకోజు దేవేంద్రాచారి (శివుడాజ్ఞ), ఎం. ప్రగతి ఉంకువ. సంజయ్ ఖాన్ (మూడో కన్ను), పీవీవి సత్యనారాయణ భాగ్యమతి, జీ.వి.శ్రీనివాస్ (నేలరాలిన పువ్వు), బి. కళా గోపాల్ (ఇష అనంతం), గుమ్మడి రవీంద్రనాథ్ (అనగనగా ఒక హంస), ఆర్వీ రమణ శాస్త్రి (అసూయ కథలు), సాధారణ ప్రచురణకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రముఖ సాహితీవేత్తలు లంకా శివరావకృష్ణ, వేంపల్లి షరీఫ్‌లు హజరవుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 69వ రాష్ట్రస్థాయి

అండర్-17 కబడ్డీ పోటీలు

- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న మంత్రులు, అధికారులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన సిబ్బంది



పినపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి 69వ క్రీడాపోటీలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్లబయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా జరగనున్న 69 వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో తలపడేందుకు తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 10 బాలికల జట్లు, 10 బాలుర జట్లు పాల్గొంటున్నాయి. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శుక్రవారమే పలు జిల్లాల జట్లు నిర్వహణ వేదికకు చేరుకుని రిపోర్టు చేశాయి. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీపీఓ అనూష శుక్రవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడా స్థలాలు, క్రీడాకారులు బస చేసేందుకు ఏర్పాట్లను పరిశీలించి, తగు సూచనలు చేశారు. క్రీడాకారులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లుండాలని మండలాధికారులను ఆదేశించారు. అవసరమైన మెటీరియల్, ఇతర ఏర్పాట్లకు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. విద్యుత్, తాగునీరు, శానిటేషన్, హెల్త్ క్యాంప్, ఫస్ట్ ఏయిడ్ కిట్స్, భద్రతా సిబ్బంది, వంటి అంశాలతో సమగ్ర ప్రణాళికతో, జిల్లా యువజన క్రీడలు, పోలీస్, పంచాయతీరాజ్ శాఖ, విద్యా శాఖ, అటవీ, విద్యుత్ శాఖల సమన్వయంగా పని చేసి క్రీడలను విజయవంతం చేయాలన్నారు. నిర్దేశిత సమయంలోగా ఏర్పాట్లు పూర్తికావాలని, లోటు పాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్, పార్కింగ్, క్రీడాకారుల భద్రతలపై తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు బాలికలు, బాలురు జట్ల క్రీడాకారులు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోటు సంకీర్త్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈవో నాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం కంది తిరుపతిరెడ్డి, పీడీలు వీరన్న, అనిల్, రాములమ్మ, నాయకులు రామనాధం, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కంది విజయ్, పాల్గొన్నారు.


క్రీడా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం, అధికారులు


పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు

స్త్రీనిధి సొమ్ములో చేతివాటం

- సభ్యులు కట్టిన రూ.8లక్షలు సొంతానికి వాడుకున్న గ్రామ దీపిక
- పాతలింగాలలో ఘటన

కామేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని నిర్మూలించి, మహిళలకు ఆర్థిక స్వాంతన కలుగజేసే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన స్త్రీనిధి పథకం పక్కదారి పడుతుంది. పొదుపు సంఘాలాలోని మహిళలు వారు తీసుకున్న లోన్‌ను ప్రతి నెల గ్రామ దీపికకు కడుతున్న కానీ గ్రామదీపిక తన సొంతానికి వాడుకున్న సంఘటన కామేపల్లి మండలం పాతలింగాలలో చోటు చేసుకుంది. పాతలింగాల గ్రామంలో 17 పొదుపు సంఘాలు ఉన్నాయి. వారిలో చాలా మంది గ్రూప్ సభ్యులు స్త్రీనిధి రుణాలు తీసుకున్నారు. ప్రతి నెల వారు వాయిదాను పాతలింగాల గ్రామ దీపికకు చెల్లిస్తున్నారు. అయితే గ్రామ దీపిక సభ్యులు కట్టిన రూ.8లక్షల3వేలు తన సొంతానికి వాడుకొని, బ్యాంక్‌లో జమ చేయలేదని ఆరోపించారు. అంతేకాక పూజిత పొదుపు సంఘం గ్రూప్‌లోని సభ్యులకు తెలియకుండా రూ.9లక్షలు కూడా తానే తీసుకొని కట్టడంలేదని గ్రూప్ సభ్యులు ఆరోపించారు. శుక్రవారం పాతలింగాలలో నగదు రహిత లావాదేవీలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 17గ్రూప్ సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో గ్రామదీపిక వాడుకున్న నగదును తిరిగి వెంటనే చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే గ్రామదీపికను తొలగించాలని తీర్మానం చేసుకొని అధికారులకు తీర్మాణ కాగితాన్ని అందజేశారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌లో భద్రాద్రి జిల్లా వాసి ప్రతిభ



మెమోంటో అందుకుంటున్న సేవిత

చుంచుపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కళా ఉత్సవ్ 2025లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విద్యార్థిని సేవిత శ్రీ వైష్ణవి ప్రతిభ చాటి ద్వితీ య స్థానం సాధించింది. మండలానికి చెందిన విద్యార్థిని గిన్నారపు సేవిత శ్రీ వైష్ణవి పాటల విభాగంలో భద్రాద్రి జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించింది. పాల్వంచ నవభారత్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతుంది. గత నెలలో కొత్తగూడెం క్లబ్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌లో సింగింగ్ కాంపిటీషన్‌లో మొదటి స్థానం కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్‌కి ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో వైష్ణవి ద్వితీయ స్థానం గెలుచుకొని పలువురి ప్రశంశలు అందుకున్న ది. అనంతరం కళా ఉత్సవ్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్స్ డాక్టర్ నవీన్ నికోలస్, రాధరెడ్డి, చేతుల మీదుగా మెమోంటో, ధృవపత్రం అందజేశారు. తల్లి దండ్రులు గిన్నారపు నాగేందర్, అంబికా మాట్లాడుతూ మా కమార్తె సేవిత శ్రీ వైష్ణవి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం వరించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డాక్టర్ రామారావు



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్ర జ్యో తి): క్యాన్సర్ అనేది ఒక్కరోజులో వచ్చే వ్యాధి కాదు.. ఇది జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పర్యావరణ ప్రభావాలు, వంశపారంపర్య కారణాల వలన క్రమంగా ఏర్పడే ప్రమాదకర వ్యాధి అని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివార ణ అధికారి డాక్టర్ రామారావు అన్నారు. జాతీ య క్యాన్సర్ నివారణ అవగాహన దినం సందర్భంగా ఆయన ప్రజలకు క్యాన్సర్ నివారణకు అవసరమైన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన చాలా అవసరం ఉందన్నారు. పొగతాగడం, మద్యపానం, పోగాకు నమలడం వంటి అలవాట్లను పూర్తిగా మానేయాలన్నారు. తీసుకునే ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు, పీచు ఎక్కువగా వుండే కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీర రక్షణశక్తి (రోగానిరోధక శక్తి) పెరుగుతుందన్నారు. బేకరీ పదార్థాలు, బయట రోడ్ల మీద అమ్మే తిను పదార్థాలను పూర్తిగా తగ్గించాలని సూచించారు. రోజువారీ శారీరక శ్రమ, యోగ , స్ట్రెస్ మానేజ్మెంట్ ద్వారా హార్మోన్‌ల సమతుల్యత కాపాడుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండే ఆస్కారం ఉంటుందన్నారు. నిత్య జీవితంలో ఏమైనా తాగాలన్నా, తినాలన్నా పేపర్ కప్స్ , పేపర్ ప్లేట్స్ వాడడం వల్ల కూడా వాటిని తయారు చేయడానికి ఉపయోగించిన రసాయనాల ద్వారా విషపదార్థాలు ఏర్పడి ఆరోగ్యానికి హానికారకంగా మారి రకరకాల క్యాన్సర్లకు కారణమవుతున్నాయని తెలిపారు.. ప్రజలు క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహనతో ఉండాలని తెలిపారు.

న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి బదిలీ

ఖమ్మం లీగల్, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ఖమ్మం న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కేవీ. చంద్రశేఖరరావు బదిలీ అయ్యారు. ఆయనను నల్గొండ జిల్లా మిర్యాలగూడెం ఐదవ అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీచేస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఇటీవల కల్పించిన పదోన్నతుల్లో భాగంగా అదనపు జిల్లా న్యాయాధికారిగా పదోన్నతి కల్పిస్తూ బదిలీచేశారు.

సరికొత్త విధానంతో మోకాలి నొప్పులకు శస్త్రచికిత్స



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు సునిల్ దాచేపల్లి

ఖమ్మం చర్చికాంపౌండ్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మోకాలి నొప్పులకు సరికొత్త శస్త్ర చికిత్స రోబోటిక్ సర్జరీ ద్వారా సాధ్యమవుతుందని హైద రాబాదు సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యుడు సునిల్ దాచే పల్లి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసినన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ మోకాలునొప్పి వచ్చాక ఫిజికల్ ఫిట్‌నెస్ లేకపోతే జీవితాంతం మంచమీద ఉండాల్సి వస్తుందన్నారు ఇప్పుడు సరికొత్తగా రోబోటిక్ సర్జరీ ద్వారా చేసే మోకాల మార్పిడి ద్వారా గాయం చిన్నగా ఉంటుందని, నొప్పి తక్కువగా ఉంటుందన్నారు. రోబోటిక్ సర్జరీ చేసిన నాలుగు గంటలనుండే నడవచ్చన్నారు. ఫిజియోథెరపి చేసే సమయంలో నొప్పులు కూడా తక్కువగా ఉంటాయని తెలిపారు. మోకలి నొప్పులకు శస్త్రచికిత్స రోబోటిక్ సర్జరీ ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి పాలకమండలి.. కూర్పుపై సర్వత్రా ఆసక్తి

(5వ పేజీ తరువాయి)

తరలివ స్తుంటారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, వసతులకు ప్రాధాన్యమివ్వడంతో పాటు స్వామివారి శీఘ్రదర్శనం అందేలా కృషి చేసే పాలక మండలి ఎంతో అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేవస్థానం పరిధిలో భక్తులకు వసతి కల్పించేందుకు ఆశించినంతస్థాయిలో సత్రాలు, కాటేజీలు లేకపోవడంతో వాటిపై ప్రధానంగా దృష్టిసారించేందుకు తోడ్పడే ప్రముఖులకు పాలక మండలి చైర్మన్ పగ్గాలు అప్పగిస్తే ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పాలకమండలి ఊసే మరిచిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గతేడాది నవంబరు 12న పాలకమండలి కోసం నోటిఫికేషన్ ఇచ్చినా పాలకమండలిని ఏర్పాటు చేయలేదు. కాగా తాజాగా రెండోసారి ఏడాది అనంతరం మళ్లీ ప్రకటన జారీ చేయటంతో ఆశావహుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.



ఇప్పటి వరకు 14 పాలక మండళ్లు

భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ఇప్పటి వరకు 14పాలక మండళ్లు ఏర్పాటయ్యాయి. రామాలయాన్ని 17వ శతాబ్దంలో భక్తరామదాసు నిర్మాణం చేపట్టి పూర్తి చేయగా.. కాగా 1960లో భద్రాద్రి రామాలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చింది. ఆ సమయంలో అప్పటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి చైర్మన్‌గా భద్రాద్రి రామాలయ అభివృద్ధి కమిటీ రూపుదిద్దుకుంది. అనంతరం భద్రాద్రి దేవస్థానానికి పాలకమండళ్లను నియమించడం సంప్రదాయంగా మారింది. తొలినాళ్లలో మూడేళ్లపాటు పాలక మండలి పదవీ కాలం ఉండగా అనంతరం ఏడాది పాటు తరువాత మళ్లీ రెండేళ్లపాటు పదవీ కాలాన్ని మార్చారు. ప్రస్తుతం ప్రభుత్వం నూతన పాలక మండళ్లకు ఏడాది మాత్రమే కొనసాగే విధంగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

2012లో ముగిసిన చివరి పాలక మండలి

భద్రాద్రి దేవస్థానం పాలక మండలి చివరిసారిగా 2010 నవంబరు 26న కొలువుదీరింది. నాడు దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా భద్రాచలానికి చెందిన కురిచేటి పాండురంగారావు బాధ్యతలు స్వీకరించారు. 2012 నవంబరు 25న పాలక మండలి గడువు ముగిసింది.

14 మంది చైర్మన్లు వీరే...

భద్రాద్రి దేవస్థానం పాలక మండలికి తొలి చైర్మన్‌గా కల్లూరి చంద్రమౌళి వ్యవహరించగా.. ఆ తర్వాత వరుసగా బండి శోభనాచలం, ఎస్.యతిరాజారావు, ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్, కోనేరు నాగేశ్వర రావు, బోళ్ల వెంకటేశ్వర్లు, కత్తుల శాంతయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కురిచేటి పాండురంగారావు ఉండగా.. వీరితో పాటు అల్లూరి మూర్తిరాజు మూడు పర్యాయాలు చైర్మన్‌గా పనిచేశారు.

పీహెచ్‌సీ అప్‌గ్రేడేషన్ ఎప్పుడు..?

- ఖాళీగా పలు పోస్టులు.. పనిచేస్తున్న వారిపైనే అదనపు భారం
- ల్యాబ్ టెక్నీషియన్ లేక ప్రజలకు తప్పని ఇబ్బందులు
- సమస్యలను పరిష్కరించాలని వేడుకోలు



అప్‌గ్రేడేషన్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్న పీహెచ్‌సీ ఇదే

బోనకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బోనకల్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇప్పటి వరకు అప్‌గ్రేడేషన్‌కు నోచుకోలేదు. కేవలం సాధారణ పరీక్షలకే పీహెచ్‌సీ పరిమితం కావడంతో వ్యాధుల తీవ్రతను బట్టి ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అనారోగ్యాల బారిన పడిన ఎక్కువ మంది గ్రామీణ వైద్యుల సహకారంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు. వైద్యం ఖరీదైనా తమ జబ్బులు తగ్గించుకొని ప్రాణాలు కాపాడుకునేందుకు గానూ అప్పులు చేయక తప్పడం లేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పీహెచ్‌సీ పని చేస్తుంది. కేవలం ఆరు పడకల ఆసుపత్రి కావడంతో రాత్రివేళల్లో అత్యవసర వైద్య సేవలకు ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. గతంలో డెంగ్యూ జ్వరాలతో మండల ప్రజలు మృతి చెందడం, రాత్రింబవళ్లు పీహెచ్‌సీలో సేవలు అందిచండం జరిగింది. నాటి వైద్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మండలంలో పర్యటించిన క్రమంలో పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. నాటి నుంచి నేటి వరకు ఆసుపత్రిని 24 గంటల పాటు పని చేసేలా అప్‌గ్రేడ్ చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులను కోరుతూనే ఉన్నారు. వారి ఆకాంక్ష ఎన్నటికి నెరవేరుతుందో వేచి చూడాలి. అప్పటి వరకు ఇవే ఇబ్బందులు పడుతూనే ఉండాలని పలువురు వాపోతున్నారు.

పనిచేస్తున్న వారిపైనే భారం..

మండలంలో 22 గ్రామాలుండగా 11,685 ఇళ్లు, 42,038 మంది జనాభా ఉన్నారు. వీరందరికి సేవలందించే మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు 9 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నా యి. వీటిలో పూర్తిస్థాయి పోస్టులు లేక ప్రస్తు తం పని చేసే వారి పై అదనపు భారం పడుతుంది. పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. హెల్త్ అసిస్టెంట్లు-4, ఏఎన్ఎంలు-6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్‌ను ఖమ్మంలోని ప్రభుత్వ రక్త పరీక్షల కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపించడంతో ఆరు నెలలుగా బోనకల్ పీహెచ్‌సీలో ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించడానికి అక్కడ పని చేసే సిబ్బంది తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలినపుడు ల్యాబ్ టెక్నీషియన్ లేనందున రక్త నమునాలు తీసుకొని, ఆన్‌లైన్ చేయడం తలకు మించి భారంగా మారింది. చిరునోముల, ముష్టికుంట్ల తదితర గ్రామాల్లో గల ఆరోగ్య ఉప కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని, అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు గానూ వైద్య పరికరాలను మంజూరు చేయలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అందని దంత వైద్యసేవలు

- రోగులకు తప్పని అవస్థలు...
- మూలనపడిన పరికరాలు
- మూడు నెలలుగా ఖాళీగా ఉన్న వైద్యుడి పోస్టు


జూలూరుపాడులోని ప్రభుత్వ దంత వైద్యశాలలో మూలనపడిన పరికరాలు

జూలూరుపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దంత సమస్యలతో బాధపడే వారికి సేవలను అందించేందుకు గాను ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేకంగా డెంటల్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దంత వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులకు అవస్థలు తప్పడంలేదు. నియమితులైన డెంటిస్ట్‌లు బదిలీ, డిప్యూటేషన్‌లపై మరో చోటుకు వెళ్ళడంతో ఆసుపత్రిలో ఆ పోస్ట్ ఖాళీగా ఉన్నప్పటికి మరొకరిని నియమించి రోగులకు సేవలను అందించే విధంగా వైద్య శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది. జూలూరుపాడులోని ప్రభుత్వాసుపత్రిలో 8ఏళ్ల క్రితం డెంటల్ యూనిట్‌ను ఏర్పాటు చేసి దంత వైద్యుడిని నియమించారు. కాగా ప్రజలకు దంత సేవలను అందించేందుకు పరికరాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో నామమాత్రంగానే సేవలు అందించారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పూర్తిస్థాయిలో దంత వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంకల్పించి అప్పటి కలెక్టర్ 2019లో డెంటల్ యూనిట్‌కు రూ.7 లక్షల పరికరాలను సమకూర్చారు. దీంతో దంత వైద్యుడు పోటు వినోద్ రోగులకు సేవలను అందించారు. సదరు వైద్యుడు గత ఏడాది జూలైలో మల్కాజ్‌గిరికి బదిలీ అయ్యారు. ఆతర్వాత కొన్ని నెలలపాటు ఇక్కడ వైద్యుడి పోస్ట్ ఖాళీగానే ఉంది. తర్వాత కొంత కాలానికి బూర్గంపాడు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న దంత వైద్యురాలిని ఇక్కడ నియమించడం జరిగింది. కొద్ది రోజులు మాత్రమే విధులు నిర్వహించి తిరిగి డిప్యూటేషన్‌పై ఆమె బూర్గంపాడు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. దీంతో కొన్ని నెలల పాటు డెంటిస్ట్ పోస్ట్ ఖాళీగా ఉండడంతతో దంత సేవలు నిలిచిపోయాయి, దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.

మూడు నెలలుగా అందని సేవలు....

అంగట్లో అన్ని ఉన్న అల్లుడినోట్లో శని ఉన్నట్టుగా, జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో డెంటల్ యూనిట్, అందుకు తగిన పరికరాలు అన్ని ఉన్నప్పటికి డెంటిస్ట్‌లు స్థిరంగా ఇక్కడ ఉండకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఐదు నెలల క్రితం ఒక దంత వైద్యురాలిని నియమించారు. ఈ నియామకం కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారింది. ఆమె 6 నెలల పాటు ప్రసూతి సెలవు పెట్టడంతో ఆగస్టు నుంచి ఈ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు దంత సేవల కోసం ఈ ఆసుపత్రికి 15 మంది నుంచి 20 మంది వరకు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. డెటిస్ట్ లేకపోవడంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు ఈసమస్యను గుర్తించి తక్షణమే డెంటిస్ట్ పోస్ట్‌ను భర్తీ చేసి ప్రజలకు దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాను

బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వ వైద్యాధికారి, జూలూరుపాడు



జూలూరుపాడు ప్రభుత్వాసుపత్రిలో దంత వైద్య సేవలు నిలిచిపోవడంతో ప్రజలు పడుతున్న సమస్యను వైద్యశాఖ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. డెంటిస్ట్‌ను నియమించి ప్రజలకు సేవలను అందుబాటులోకి త్వరలోనే తీసుకువచ్చే విధంగా కృషి చేస్తాను.

కుటుంబ ప్రయోజనం.. నిర్వీర్యం

జాతీయ పథకం ఎన్‌ఎఫ్‌బీఎస్‌పై
కొరవడిన అవగాహన
నీరుగారుతున్న
కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
భద్రాద్రి జిల్లాలో 2024 జనవరి
నుంచి ఈ ఏడాది ఆగస్టు నాటికి
ఒక్కరూ దరఖాస్తు చేయని వైనం



కొత్తగూడెం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్దదిక్కు అనివార్య కారణాలతో మృతిచెందితే ఆ కుటుంబం వీధిన పడుతుంది. అలాంటి కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బృహత్తరమైన జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి (ఎన్‌ఎఫ్‌బీఎస్) శ్రీకారం చుట్టింది. 2017లో అమలులోకి వచ్చిన ఈ పథకం కింద రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తుంది. అయితే ఈ పథకం తీరుతెన్నులపై అవగాహన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో నిర్వీర్యమవుతోంది. చాలామంది అర్హులుగా ఉండి కూడా దరఖాస్తులు చేసుకోని పరిస్థితి. ఈ పథకం అమలుల్లోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీనిపై గ్రామ, మండల, పట్టణస్థాయిలో అధికార యంత్రాంగం నిరుపేదలకు అవగాహన కల్పించకపోవడంతో అర్హులైన వారిలో చాలామంది ప్రయోజనం పొందలేకపోతున్నారు. తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో సెర్ప్ వద్ద రూ.60 కోట్ల పైచిలుకు నిధులు నిరుపయోగంగా ఉన్నాయని ఉన్నత అధికారులు చెబుతున్నారు. అవగాహన లేమితో ఈ పథకం నిరుపేదలకు అందని ద్రాక్షలా మారింది. ఈ పథకానికి ప్రచారం లేకపోవడంతో జిల్లాలో ప్రభుత్వ ఆశయం నీరుగారినట్లయ్యింది. ఫలితంగా జిల్లాలో 2024 జనవరి నుంచి 2025 ఆగష్టు వరకు ఒక్క దరఖాస్తు రాలేదు. గతంలో రాష్ట్ర కార్యాలయం నుంచి లబ్ధిదారులకు డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో ఈ పథకంపై అనాశక్తి కనబర్చారని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగా.. సెప్టెంబర్ నెలలో కొత్తగూడెం తహశీల్ కార్యాలయం నుంచి కేవలం నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించామని తహసీల్దార్ పుల్లయ్య తెలిపారు.

పథకం తీరుతెన్నులు ఇలా..

గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో దారిద్య్రేఖకు దిగువన ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ఏడాది తర్వాత కుటుంబ పెద్ద సాధారణ, ప్రమాదవశాత్తు మరణించినా ఆర్థికసాయం కింద రూ.20 వేలు అందించనున్నారు. మరణించిన వారి వయస్సు 18 నుండి 60 ఏళ్ల లోపు ఉండాలి. అర్హులైన లబ్ధిదారులు సమీప మీసేవా కేంద్రాల్లో మరణ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, ఆహారభద్రత కార్డు, బ్యాంకు ఖాతా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, రూ.70 వేలలోపు ఇన్‌కం సర్టిఫికెట్ ఒక అఫడవిట్, మూడేళ్లకు పైబడి స్థానికంగా ఉంటున్నట్లు నివాస ధ్రువీకరణ పత్రాలతో మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి తహశీల్ కార్యాలయానికి దరఖాస్తు వెళ్తుంది. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్డీవో లాగిన్‌కు, అక్కడినుంచి కలెక్టరేట్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి సెర్ప్ రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తే అప్పుడు లబ్ధిదారుల ఖాతలో నగదు జమ చేస్తారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ రోహిత్‌రాజు


లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా పోలీస్ సూపరింటెండెం బిరుదురాజు రోహిత్‌రాజు ఆదేశించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం రాత్రి లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని ప్రజలు సైబర్ క్రైమ్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. బ్లూకోర్ట్ పెట్రోలింగ్ వాహనాలు నిత్యం ప్రజల్లో సంచరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వృత్తి పరమైన, వ్యక్తిగతమైన సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగే విధంగా అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమణారెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.

పాల్వంచ పోలీసులకు ఎస్పీ అభినందనలు


పాల్వంచ పోలీస్ అధికారులను అభినందిస్తున్న ఎస్పీ

పాల్వంచ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ పోలీసులను ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం అభినందించారు. బుధవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనానికి ప్రయత్నించిన గ్యాంగ్‌ను పాల్వంచ టౌన్ పోలీసులు అప్రమత్తతో వ్యవహరించి వారిని అరెస్టు చేశారు.దొంగతనం, హత్య జరుగకుండా ముందుగానే గుర్తించి నియత్రించినందుకు ఎస్పీ కార్యాలయంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ సతీష్, టౌన్ ఎస్ఐ సుమన్‌లను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు రక్షణ కల్పిస్తూ, ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలిచేవారికి తప్పకుండా గుర్తింపు, గౌరవం లభిస్తాయని అన్నారు.

జిల్లాస్థాయి హాకీ జట్టులో రాధిక కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి


ఎంపికైన కౌసిక్

మణుగూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న 69వ ఎస్‌జీఎఫ్ పాఠశాలల జిల్లాస్థాయి క్రీడల్లో భాగంగా అండర్ 14 హాకీ విభాగంలో మణుగూరు రాధిక పాఠశాలకు చెందిన టీజీటీ కౌసిక్ ఎనిమిదో తరగతి విద్యార్థి ఉమ్మడి ఖమ్మంజిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. శుక్రవారం పాఠశాల ఛైర్మన్ గంగిరెడ్డి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయికి ఎంపికైన కౌసిక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జయసింహారెడ్డి, సంపత్‌రెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, నూకారపు రమేష్, హెచ్‌ఎం నరేష్, కోఆర్డినేటర్లు ఉష, కీర్తి, పీఈటీ నరేందర్, చంద్రకళ తదితరులు విద్యార్థి కౌసిక్‌ను అభినందించారు.

మామిళ్లవాయి బీట్‌ను సందర్శించిన డీఎఫ్‌వో


మామిళ్లవాయి జలపాతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణగౌడ్

అశ్వాపురం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అశ్వాపురం, యానంబైలు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మామిళ్లవాయి బీట్‌ను శుక్రవారం జిల్లా ఫారెస్ట్ అధికారి క్రిష్ణగౌడ్ సందర్శించారు. బీట్ పరిధిలో ఉన్న జలపాతాన్ని, సహజ అడవులు, చెక్‌డ్యాంల నిర్మాణాలను పరిశీలించారు. పర్యాటక రంగంగా మార్చేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చించారు. అందుకు అవసరమైన విధానాలను రూపొందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమం లో రేగళ్ల ఎఫ్ఆర్‌వో జశ్వంత్, ఎఫ్ఎస్‌వో సునీత, బీట్ అధికారులు జోగేష్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీటింగ్ కెపాసిటీని మించి నడపలేం..?

ఎక్కువ మంది ప్రయాణికులతో
నడపడం వల్ల ప్రమాదాలు
ఎక్కువ జరుగుతున్నాయి
ఖమ్మం రీజయన్ అద్దె బస్సుల
యాజమానుల సంఘం నాయకులు
ఆర్ఎంకు వినతి పత్రం


ఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు బస్సుల యజమానులు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బస్సుల్లో సిట్టింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువ మంది ప్రయాణికులు రవాణా చేస్తున్నారని దీనివల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ప్రైవేటు బస్సుల యజమానులు అన్నారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రైవేటు బస్సుల యజమానులు మాట్లాడారు. టీజీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన మహిళాపథకం వచ్చిన నాటి నుంచి బస్సుల్లో సిట్టింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువ మంది ప్రయాణికులు ప్రయాణించుట వలన వివిధ సమస్యలకు తోడు ఎంత నష్టం వచ్చినా టీజీఎస్ ఆర్టీసీని దృష్టిలో పెట్టుకొని మేము ప్రయాణికులను గమ్య స్థానాలకు భద్రంగా చేర్చుతున్నామని తెలిపారు. రాష్ట్ర సంఘం తరుపున చాలా సార్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొనివెళ్లామని, అయిననూ టీజీఎస్ ఆర్టీసీ వారి నుంచి అధికారికంగా మాకు ఎటువంటి హామీ దొరకలేదన్నారు. అగ్రిమెంట్లో తెలిపిన ప్రకారంగా కాకుండా అధికముగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చటం మేము చేస్తున్న నేరమా?, మా బస్సుల్లో అధికంగా ప్రయాణికులు రవాణా చేయకుండా సిట్టింగ్ కెపాసిటీ వరకే అనుమతి ఇప్పించగలరని కోరారు. లేనియడల మేము బస్సుల్లో అధిక ప్రయాణికులను రవాణా చేయలేమని, అలాగే వుంటే ఈనెల 24 తేదీ నుంచి బస్సులను ఖమ్మం రీజయన్ మొత్తం నడపలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైయర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నకిరికంటి సత్యంబాబు, ప్రధాన కార్యదర్శి పైయడిపల్లి రవికుమార్, భద్రాచలం కొత్తగూడెంజిల్లా అధ్యక్షుడు చంద్రరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కునాల శ్రీనివాసరావు, ఖమ్మం డిపో నుంచి సూరంపల్లి నరేందర్, నల్లమోతు రమేష్, కర్ణాటక సీతారాములు, సత్తుపల్లి డిపో నుంచి పుల్లా సుబ్బారావు, వనమ శ్రీనివాసరావు, మధుర డిపో నుంచి ఏవీ రావు, భద్రాచలం డిపో నుంచి కే.కొండబాబు, సీహెచ్ శ్రీనివాస ప్రసాద్, మణుగూరు డిపో నుంచి నామ రమేష్ రీజయన్ అద్దె బస్సుల యాజమానుల సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎంకు వినతిపత్రం అందించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆశ్రమ విద్యార్థినులు..


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

దుమ్ముగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గౌరారం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి హాకీ, హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. హాకీ పోటీలకు అండర్-14 విభాగంలో ఇరకం దీపిక, కంగాల సంధ్య, పొడియం అనూష, మడకం మౌనిక, సోడి అద్విత, కల్లూరి రిషికావర్ధిని, పొడియం సుగుణ, కొమరం నవ్య, మిడియం సునీత, అండర్-17 విభాగంలో సోడి మధు, ఇర్ప సంధ్య, మిడియం ప్రమీల, పర్శిక అనుష్క, హ్యాండ్ బాల్ పోటీలకు పాయం వైష్ణవిలు ఎంపికయ్యారు. ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో వీరంతా అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. వీరిని హెచ్‌ఎం మోతీరు, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య


ఎస్‌కే గౌసుద్దీన్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. సత్తుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మసీద్‌రోడ్‌కు చెందిన షేక్ దస్తగిరి కుమారుడు గౌసుద్దీన్(34) మండలంలోని సత్యంపేటలో ఆటో నడుపుతూ నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో అతనికి ఆర్థిక ఇబ్బందులతో అప్పులు పెరగడంతో తీర్చలేమోనని తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు అతన్ని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈమేరకు మృతుడి తండ్రి దస్తగిరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్ఎంపీ..


ఆర్ఎంపీ న్యూటన్ కుమార్ మృతదేహం

అశ్వారావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసవడం, అప్పులు పెరగటం, కుటుంబపోషణ భారంగా మారటంతో ఓ ఆర్ఎంపీ తన క్లినిక్‌లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అశ్వారావుపేటలో శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తా ప్రాంతానికి చెందిన సర్కార్ న్యూటన్ కుమార్(43) అనే వ్యక్తి దాదాపు 20 ఏళ్ల క్రితం అశ్వారావుపేట వచ్చి ఆర్ఎంపీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్‌లో పద్మజా క్లినిక్ పేరుతో మొలల వైద్యం చేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఆసుపత్రికి వచ్చిన న్యూటన్ కుమార్ క్లినిక్ షట్టర్ దించి ఫ్యాన్‌కు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తొమ్మిది గంటల ప్రాంతంలో కొందరు రోగులు క్లినిక్ వద్దకు వచ్చి ఫోన్‌చేయగా స్పందించలేదు. చాలాసేపటి తరువాత రోగులు షట్టర్‌ను ఎత్తగా వైద్యుడు ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సంఘటన సమాచారం అందుకున్న ఎస్ఐ అఖిల ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ఖమ్మం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితో బాధపడుతూ.. పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు శుక్రవారం కేసు నమోదయ్యింది. రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన తుపాకుల పాపారావు(42) నగరంలోని ఏఫ్‌సీఐ రోడ్డులోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అతను కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. గురువారం పనికి ఖమ్మం వచ్చిన ఆయన కడుపునొప్పి ట్యాబ్లెట్ తెచ్చుకుంటానని చెప్పి వెళ్లి పురుగులమందు తాగి ఇంటికి వెళ్లాడు. ఈ విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా దారి మధ్యలోనే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

మణుగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మణుగూరులోని చేపల మార్కెట్ ఏరియాలో నివాసముండే వి.విజయ్(30) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతను తీవ్ర మానస్థాపానికి గురై శుక్రవారం ఇంటో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఓ కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య రెండేళ్లగా తల్లివద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో మానసిక ఒత్తిడికి లోనైన విజయ్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైన్‌స్నాచర్‌పై పీడీయాక్ట్


నిందితుడు గణేష్‌కు పీడీ యాక్ట్ నమోదు పత్రాన్ని అందిస్తున్న సీఐ ముత్తు లింగం

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలను లక్ష్యంగా చేసుకొని వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న మూడు గణేష్ పై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు నిందితుడిపై కేసు నమోదు చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతలపూడి మండలం నామవరం గ్రామానికి చెందిన మూడు గణేష్‌పై ఆంధ్రప్రదేశ్‌లో 13 కేసులు, ఖమ్మం జిల్లా సత్తుపల్లి, కల్లూరు పోలీస్ స్టేషన్లలో 5 చైన్‌స్నాచింగ్ చోరీల్లో నిందితుడిగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కరుడు గట్టిన సదరు నిందితుడు ఖమ్మంకు వచ్చి తమకు అనుకూలమైన ప్రాంతంలో రెక్కీ చేస్తాడని, చోరీలు చేసిన తర్వాత సులభమైన మార్గాలను ఎంచుకుంటాడని సీఐ తెలిపారు. ఇలా ఇళ్లలో, రోడ్లపైన ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని మంగళసూత్రాన్ని తెంపుకొని పారిపోతుంటాడని వివరించారు. తద్వారా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలలో భయాందోళనలు సృష్టిస్తున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాలతో కల్లూరు ఏసీసీ ఏ.రఘు పర్యవేక్షణలో నిదింతుడు గణేష్‌ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ ముత్తులింగం తెలిపారు.

స్తంభాలపై విద్యుత్ తీగల అపహరణ

కామేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంట చేనులో ఉన్న మూడు స్తంభాల చెందిన విద్యుత్ తీగలను గుర్త తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన కామేపల్లి మండలం రామక్రిష్ణపురం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా రామక్రిష్ణపురం గ్రామానికి చెందిన ఆంగోత్ లక్ష్మణ్ గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిలో పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నాడు. ఈ మేరకు శుక్రవారం రైతు మిరప తోటకు నీరు పెడదామని వెళ్లగా మూడు స్తంభాలకు చెందిన విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఇదే విషయంపై ఏఈ శ్రీనివాసులను వివరణ కోరగా విచారణ చేసి రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఖమ్మం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొణిజర్లకు చెందిన పానుగంటి శ్రీకాంత్(20) ఓ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై ఖమ్మం వస్తుండగా నగర శివారులోని గోపాలపురం సమీపంలోని ఓ దాబా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో శ్రీకాంత్ పొట్టభాగం నుజ్జునుజ్జయి అక్కడిక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలం వద్దకు చెరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఏలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులు ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. శుక్రవారం సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రి యలు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం ఖమ్మం జీఆర్పీ పోలీస్ పరిధిలో నర్తకీ టాకీస్ ప్రాంతంలో గుర్తుతెలియని(50) మగ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతదేహం దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని పోలీసులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచా రు. ఇప్పటివరకు ఈ మృతదేహం కొరకు ఎవరూ రానందున అనాథ శవంగా భావించి జీఆర్పీ పోలీస్‌లు శవ పరీక్ష అనంతరం అంత్యక్రియల కొరకు అన్నం ఫౌండేషన్‌కి అనుమతి పత్రాన్ని ఇచ్చారు. రైల్వేపోలీస్ సిబ్బంది, వైద్యశాల సి బ్బంది సమక్షంలో మార్చురీ నుంచి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని బల్లేపల్లి వైకుంఠ దామంలో అంత్యక్రియలు అన్నం ఫౌండేషన్ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయంలో హుండీ చోరీ

సుజాతనగర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాఘవాపురం అంకమ్మతల్లి ఆలయ హుండీ చోరీకి గురయినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాఘవాపురం గ్రామంలోని అంకమ్మతల్లి ఆలయం వద్ద పూజకు వచ్చిన ఓ భక్తుడు అక్కడ హుండీ లేకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు హుండీ కోసం వెతగ్గా ఊరిబయట దొంగలు ఆ హుండీని వదిలేసి అందులో ఉన్న సుమారు రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు అనుమానం వ్యక్తంచేశారు. గతంలో కూడా ఇలా దొంగలు హుండీని ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలపడం విశేషం.

ఇద్దరు సైబర్ నేరగాళ్లకు జైలు శిక్ష

ఖమ్మం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లకు న్యాయమూర్తి నాగలక్ష్మి ఒక ఏడాది 11 నెలల 2 రోజులు జైలుశిక్ష విధించినట్టు వన్ టౌన్ సీఐ కరుణాకర్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మహిర్ అజాద్, వకీల్‌లు సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వారిపై నేరం రుజువు కావడంతో జడ్జి వారికి పై విధంగా జైలుశిక్ష విధించినట్టు సీఐ ప్రకటనలో తెలిపారు.

బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఆర్ఎంపీపై కేసు నమోదు

కారేపల్లి నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ యువతిని పెళ్లిచేసుకోవాలని, లేకుంటే గతంలో నీతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్‌చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్న ఓ ఆర్ఎంపీపై శుక్రవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ బైరు గోపి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏన్కూరు మండలానికి చెందిన ఓ ఆర్ఎంపీ కారేపల్లి మండలం రేలకాయలపల్లికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ఈ క్రమంలో ఆమెతో సన్నిహితంగా ఉంటూ ఫొటోలు దిగారు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకొని యువతికి చూపిస్తూ పెళ్లి చేసుకోవాలని, ఆ యువతి వ్యక్తిగత పనులకు వెళ్తున్న సమయంలో తన మోటర్ సైకిల్‌పై వెంటపడుతూ వేధిస్తున్నాడని, ఆర్ఎంపీ వేధింపులు తట్టుకోలేక యువతి తన కుటుంబ సభ్యులకు తెలిపి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్


జూలూరుపాడులో ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాక్టర్

జూలూరుపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులోని ఒంటిగుడిసె క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పినట్లు అయింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు డిపోకు చెందిన టీఎస్ 28 టీపీ 2979 నెంబర్ గల బస్సు ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తుంది. ఏన్కూరు మండలం నాచారం గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వరావు, డ్రైవర్ లకావత్ చందుతో కలిసి ట్రాక్టర్‌లో పత్తిని తీసుకుని విక్రయించేందుకు జూలూరుపాడు వచ్చాడు. సదరు రైతు పత్తిని విక్రయించి పెట్రోల్ బంకకు వెళ్లి ట్రాక్టర్‌లో డీజిల్ పోయించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒంటిగుడిసె క్రాస్ రోడ్డు సమీపంలో ట్రాక్టర్ డ్రైవర్ చందు ఫోన్‌లో మాట్లాతూ ట్రాక్టర్ నడుపుతూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంతో వారు ఆందోళనకు గురయ్యారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులను వేరే బస్సు ఎక్కించి పంపిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.



పత్తి కొనుగోలు నిబంధనలు ఎత్తివేయాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలను ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నాయకులు నిరసన తెలిపారు. తేమశాతం 8 నుంచి 12శాతానికి పెంచటం, ఎకరానికి ఏడు క్వింటాళ్ల కొనుగోలు చేయాలని అడ్డగోలు నిబంధనలు సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాతా భాస్కర్‌రావు, ఎస్‌కే మీరా, చింతనిప్పు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రఘునాథపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో వ్యవసాయ రంగానికి సంపూర్ణంగా సాగు నీరు అందుబాటులోకి వచ్చిందని రైతులు తక్కువ శ్రమ, ఎక్కువ కాలం ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలని ఆయిల్ పామ్ రైతు, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ కోరారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదికలో నిర్వహించిన ఆయిల్ పామ్ రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు ద్వారా తమ అనుభవాలను వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్, అయిల్ పామ్ సాగు ద్వారా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను వివరించారు. ఖమ్మం ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏవో ఉమా మహేశ్వరరెడ్డి గోద్రేజ్ జనరల్ మేనేజరు చావా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ సొసైటీల చైర్మన్లు తాతా రఘురాం, రైతులు వెంకటనారాయణ, చంద్రారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా మృతుల కుటుంబాల సభ్యులకు ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించారు. వివిధగ్రామాలకు చెందిన 60 మంది మృతుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేల వంతున ఆర్థికసాయం అందించారు. సుబ్లేడులో మృతిచెందిన మృతుల కుటుంబాలకు రూ.10వేలతో పాటు 50కేజీల బియ్యాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి అందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, గుర్రాల శ్రీనివాసరెడ్డి, నాయకులు సుమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, అనిల్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ 44 సిద్ధి వరి రకంతో అధిక దిగుబడులు

కామేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వరంగల్ 44 సిద్ధి రకంతో వానాకాలంలో అనుకూలమొందని, అధిక దిగుబడులు సాధించవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్. హేమంత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పింజరమడుగు గ్రామంలో భూక్య మోహన్‌లాల్ అనేరైతు సాగు చేసిన వరంగల్ 44(సిద్ధి) రకం వరి సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈకార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఛైతన్య, పావని, ఏవో తారాదేవి, ఏఈవో జగదీశ్వర్, రాజా, లకావత్‌నాగేశ్వరరావు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదని, పని గంటల సడలింపు ఇచ్చి పరోక్షంగా కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను దోచిపెడ్తున్నాయని టీయూసీఐ జిల్లా నాయకులు కే శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈనెల 9న నేలకొండపల్లిలో నిర్వహించనున్న సంఘం రాజకీయ శిక్షణా తరగతులు సందర్భంగా శుక్రవారం ఖమ్మం పారిశ్రామిక వాడలో విస్తృతంగా సమావేశాలు, సభలు నిర్వహించారు. రాజకీయ శిక్షణా తరగతులకు కార్మికులు హాజరు కావటం ద్వారా కార్మిక చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కలుగుతుందన్నారు. నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రమేష్, ఏ సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

క్రాంతి రణదేవ్‌కు గోల్డ్ మెడల్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర విద్యార్థి క్రాంతిరణదేవ్‌కు శుక్రవారం కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో జరిగిన కాన్వొకేషన్ వార్షికోత్సవంలో పీజీ సోషియాలజీ డిపార్టుమెంట్‌లో కాలేజీ టాపర్‌గా వచ్చి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ ఉమేష్ కుమార్ సమక్షంలో గోల్డ్ మెడల్ అందుకున్నట్లు క్రాంతి తెలిపాడు. గోల్డ్ మెడల్ అందుకున్న క్రాంతిని పలువురు అభినందించారు.



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న క్రాంతి

ఘనంగా వందేమాతరం గీతాలాపన



జిల్లా కోర్టులో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతర గేయాన్ని ఖమ్మం జిల్లా బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు ప్రధాన ద్వారం ఎదుట న్యాయవాదులు ఆలపించారు. ఖమ్మం రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి వెంపటి అపర్ణ పాల్గొని వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది ఐతం రవీంద్ర, అదనపు ప్రభుత్వ న్యాయవాది కె.రత్నాకర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.శరత్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్, వందేమాతరం గేయ రచనకు 150ఏళ్ల సందర్భంగా శుక్రవారం ఖమ్మంనగరంలోని వాడ వాడలా వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, డీఈ ధరణి అధికారులు ఉద్యోగులు గీతాలాపన చేశారు.

రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతర గీతాలాపన చేశారు. గణేశ్వరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 150 ఆకృతిలో కూర్చొని వినూత్నంగా నిర్వహించారు.

ఖమ్మం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎస్ఈ ఇనుగూరి శ్రీనివాసాచారి, ఉద్యోగులతో కలిసి వందేమాతర గేయాలాపన చేశారు.

నేలకొండపల్లి: దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల్లో చైతన్యం నింపి స్వాతంత్ర్య ఉద్యమాన్ని రగిలించటానికి వందేమాతర గీతం ఎంతో తోడ్పడిందని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. వందేమాతరం జాతీయ గీతానికి 150 సంవత్సరాలు నిండిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం నేలకొండపల్లి గౌతమి హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఎస్ఐ, పోలీస్ సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వందేమాతర గీతం దేశ ప్రజల్లో దేశ భక్తిని రగిల్చిందన్నారు. అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. నేటి సమాజంలో యువత, విద్యార్థులు చెడుకు తొందరగా ఆకర్షితులవుతున్నారన్నారు. పాఠశాల వయస్సు నుంచే మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారంటూ, మద్యం, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ పెంటరి సంతోష్, ఏఎస్ఐ మల్లయ్య, స్కూల్ కరస్పాండెంట్ కనపర్తి నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, ఎంపీడీఓ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం స్పోర్ట్స్ : వందేమాతరం గేయానికి 150 సవంత్సరాలు పూర్తైన సందర్భంగా సర్దార్ పటేల్ స్టేడియంలో సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, స్టేడియం మేనేజర్ ఉదయ్‌కుమార్ పలువురు కోచ్‌లు ఉన్నారు.

ఖమ్మంక్రైం: వందేమాతరం గీతానికి 150 ఏళ్లపూర్తయిన సందర్భంగా వందేమాతరం జాతీయగేయాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమం పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసుపరేడ్ మైదానంలో అన్ని పోలీసుస్టేషన్లలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికి జాతీయ గౌరవాన్ని ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతరం గీతం 150 ఏళ్ల వేడుకలు 2025 నవంబరు 7నుంచి 2026 నవంబరు 7వరకు ఏడాదిపాటు దేశవ్యాప్తంగా జరుగుతాయని పోలీసు అధికరులు తెలిపారు.



రఘునాథపాలెం గణేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో 150 ఆకారంలో విద్యార్థులు



ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో...



నేలకొండపల్లిలో...



వందేమాతరం గీతాలాపన చేస్తున్న పోలీసు అధికారులు

జిల్లా విద్యాశాఖాధికారి వైఖరి మార్చుకోవాలి

» టీఎస్ యూటీఎఫ్ నాయకులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి వైఖరి మార్చుకుని ఉపాధ్యాయులతో, సంఘాలతో ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. నేటి డిజిటల్ యుగంలో మీటింగ్‌లను ప్రత్యక్షంగా కాకుండా ఆన్‌లైన్‌లో కూడా నిర్వహించవచ్చని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంజాన్, నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపా రు. దూర ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమావేశాలకు తరచూ ఖమ్మం రావడం చాలా వ్యయప్రయాసలతో కూడుకున్నదని, దీని వల్ల పిల్లల విద్యాబోధనకు నష్టం జరుగుతున్నదని వాపోయారు. కొన్ని సందర్భాలలో రెండు గంటల ముందు సమాచారం ఇచ్చి సమావేశం ఏర్పాటు చేస్తున్నారని, తీరా సమావేశానికి వచ్చాక వాయిదా వేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పునరాలోచించి మండల కేంద్రాలలో లేదా డివిజన్ కేంద్రాల్లో సమీక్షలు నిర్వహించాలని కోరారు. లేదా ఆన్లైన్ వేదికల ద్వారా సమావేశాలు నిర్వహిస్తే ఉపాధ్యాయులకు వ్యయప్రయాసలు తప్పుతాయని అన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను కలిసి సమస్యలపై మాట్లాడే పరిస్థితి ఉపాధ్యాయులకు లేదని, సంఘాలకు సమస్యలపై మాట్లాడడానికి సమయం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. సమీక్షలకు హాజరు కాలేదనే పేరుతో ప్రధానోపాధ్యాయుల, ఎంఈవోల వేతనాలలో కోత విధించడం తగదన్నారు. సమావేశాలు ఖమ్మంలో నిర్వహించడం వల్ల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్నేహ పూర్వక వాతావరణంలో ఫలితాలు రాబట్టాలని డీఈఓను కోరారు.

రైతులందరికీ పరిహారం

తిరుమలాయపాలెం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తుపాన్‌తో పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభు త్వం పరిహారం అందిస్తుందని ఏవో నారెడ్డి సీతారాంరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన తుపాన్‌తో పిండిప్రోలు, తిప్పారెడ్డిగూడెం, పిండిప్రలు, జల్లేపల్లి, కేశ్వాపురం,రాకాసితండా, రమణ తండా, హైదరసాయిపేట, వెదుళ్లచెరువు తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, మిర్చి పంటలు పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. నష్టపోయి పంటలను వ్యవసాయ సిబ్బంది సందర్శించి నష్టం అంచనావేసి రైతులందరికి ప్రభుత్వం పరిహారం వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ముత్యాలమ్మ గుడి స్థలంలో నిర్మాణాలు చేపట్టవద్దు

తిరుమలాయపాలెం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామంలోని సుమా రు 50 ఏళ్లక్రితం దళితులు ఏర్పాటుచేసుకున్న ముత్యాలమ్మ గుడి స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టవద్దని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు పాపిట్ల సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో కేవీపీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 50 ఏళ్లక్రితం ముత్యాలమ్మగుడిని ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసుకున్నామని, అట్టి స్థలంలో ప్రభుత్వం కళాశాల పేరుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్థలం స్వాధీనానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కొమ్ము శ్రీను, వెంకనారాయణ, వరదయ్య, రాములు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూముల్లో.. దేవాంతకులు!

(5వ పేజీ తరువాయి)

రెండు ఎకరాల భూమిని 35మంది గ్రామస్థులు ఆక్రమించుకుని ఆవాసాలు నిర్మించుకుని ఉంటున్నారు. ఆలయ అధికారులు కొంతకాలం క్రితం వారినుంచి అద్దెను కూడా వసూలు చేశారు.

ఉక్కుపాదం మోపాల్సిందే..

ఆలయ భూముల రక్షణకు దేవాదాయశాఖ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, కబ్జాలపై ఉక్కుపాదం మోపితేనే స్వాహాపర్వానికి తెరపడుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. భూముల రీసర్వే, భూభారతిలో వివరాల నమోదు, సర్వే మ్యాపులు, పట్టాదారుపాసుపుస్తకాల పునరద్ధరణ, జియోట్యాగింగ్ లాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని ఇతర ప్రజాఉపయోగ నిర్మాణాలు చేపట్టడం ద్వారా భూములకు రక్షణతోపాటు ఆలయానికి ఆదాయం సమకూరుతుందని, ఆ దిశగా దేవాదాయశాఖ ప్రణాళికల రూపొందించాలన్న డిమాండ్ వినిపస్తోంది. ఇదిలా ఉండగా శ్రీవారి భూములు కబ్జా అంశంపై 'ఆంధ్రజ్యోతి' వివరాలు సేకరించిన సమాచారం తెలుసుకున్న దేవాలయం సిబ్బంది హడావుడిగా దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. ఈనెల 13న శ్రీవారి మాన్యం భూమి సర్వే నిర్వహిస్తున్నామని, సర్వేకి సహకరించాలంటూ శుక్రవారం సరిహద్దు రైతులకు నోటీసులు జారీచేసినట్టు సమాచారం.

దేవాదాయశాఖ నిర్లక్ష్యంతోనే భూములు అన్యాక్రాంతం

● ముష్టి కృష్ణభాస్కర్, శ్రీవారి భక్తుడు, నర్సింహాపురం



దేవాదాయశాఖ నిర్లక్ష్యంతోనే ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. 1938లో మా తాతయ్య శ్రీవారి ఆలయానికి 10.23ఎకరాలను దానంగా ఇచ్చారు. ప్రస్తుతం రికార్డులో అది 9.13 ఎకరాలుగా ఉంది. మిగిలిన 1.10భూమిరెవెన్యూ ఖాసరా ఖాళీగా ఉన్నా ఇప్పటిదాకా నమోదు చేసుకోలేకపోయారు. భూమి కబ్జాకు గురైందని పలుమార్లు దేవాలయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఆలయ అధికారులు, అర్చకుల బాధ్యతారాహిత్యం వల్ల దాతలు వెనక్కి వెళుతున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు అనుయాయులకు మాత్రమే గౌరవ మర్యాదలు తప్పా దాతలు, మిగిలిన వారికి అక్కడ స్థానంలేదు. దాతలను దాతల కోటాలో ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమిస్తే ఆలయానికి మరింత విరాళాలను సేకరించే అవకాశం ఉంటుంది.

మట్టి, డ్రైయినేజీ వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శరత్‌కుమార్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం బైపాస్ రోడ్డు పరిశుభ్రంగా మారంది. ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న కాల్వ, వంతేన, డ్రైయినేజీ వ్యర్థాలను ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ప్రత్యేకంగా గ్యాంగ్ వర్క్ చేసి క్లీన్ బైపాస్‌గా మార్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు బైపాస్ రోడ్డుకు భారీగా వరద నీరు చేరింది. వెంటనే కేఎం సీ అధికారులు వంతేనలు, కాల్వలను పగలగొట్టి వరద నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. తర్వాత వ్యర్థాలను తొలగించ లేదు. దీంతో స్థానిక కమర్షియల్ వ్యాపారులు, జాతీయ రహదారి వెంట ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. దాంతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వ్యర్థాలను తొలగించరూ' కథనం ప్రచురితమైంది. ఆంధ్రజ్యోతి కథనాన్ని స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజ కు చూపించి సమస్యను వివరించారు. వెంట నే శుక్రవారం ప్రత్యేక గ్యాంగ్ వర్క్ పనులు నిర్వహించా రు. 20మంది పారిశుధ్య కార్మికులు, జేసీబీ, డోజర్, 8 ట్రాక్టర్లతో బైపాస్ రోడ్డులోని వ్యర్థాలను తొలగించారు. ప్రధాన రహదారిని పరిశుభ్రం చేశారు. డ్రైయినేజీలపైన ఉన్న వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు డంప్ చేశారు. దీంతో స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, వ్యాపారులు, ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు సాంబ య్య, శానిటరి ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, జవా న్లు స్వాతి, లావణ్య, వెంకయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



వందేమాతరం.. వందేమాతరం..

బంకిం చంద్ర ఛటర్జీ వందేమాతరం గేయాన్ని రచించి 150సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాలతో పాటు పలు కూడళ్లలో పౌరులు వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు.



గంగారం బెటాలియన్‌లో జాతీయగేయాన్ని ఆలపిస్తున్న ఉద్యోగులు



పెనుబల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద..



ఏన్కూరు పోలీసు స్టేషన్‌లో..



మధిర తహసీల్దార్ కార్యాలయంలో..



ముదిగొండ పోలీసు స్టేషన్‌లో..



మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో..



కొణిజర్ల పోలీసు స్టేషన్‌లో..



వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

అనుమతుల్లేని పత్తి కొనుగోలు

కౌంటర్లపై అధికారుల దాడి

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- ఐదుగురు నకిలీ వ్యాపారుల నుంచి లైసెన్స్ ఫీజు వసూలు



అక్రమంగా కౌంటర్ నిర్వహిస్తున్న వ్యాపారికి నోటీస్ ఇస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కారేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎలాంటి అనుమతల్లేకుండా రైతుల వద్దనుంచి అక్రమంగా పత్తి కొనుగోలు చేస్తు రైతులను నట్టేటా ముంచుతున్న అక్రమ పత్తి కౌంటర్లపై శుక్రవారం ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎన్.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో శుక్రవారం 'కారేపల్లిలో అనుమతుల్లేకుండా వెలుస్తున్న పత్తి కౌంటర్లు' అనే వార్త కథనానికి స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు పలు నకిలీ పత్తి కౌంటర్లపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 5గురు నకిలి వ్యాపారులకు ఫీజ్ లైసెన్స్‌లు జారీ చేశారు. అధికారులు దాడులు చేస్తున్నరనే సమాచారంతో చాలమంది నకిలీలు తమ షాపులను మూసివేశారు. పత్తి లోడుతో వెళ్ళుతున్న ట్రాలీ ఆటోను అధికారులు అడ్డుకున్నారు.ఎలాంటి అనుమతులలు లేకుండా పత్తి క్రయవిక్రయాలు చేసే దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. మార్కెట్ నుంచి లైసెన్స్ ఫీజులు చెల్లించి కౌంటర్లు నిర్వహించాలన్నారు.

రాజీయే రాజమార్గం



కరపత్రాలను అందిస్తున్న శంకరరావు

కొణిజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గమని కేసులు విషయంలో ఒకరికొకరు అర్థం చేసుకోవాలని పారాలీగల్ వాలంటీర్ కొయిన్ని శంకరరావు తెలిపారు. శుక్రవారం న్యాయసేవాధికారి సంస్థ జడ్జి చంద్రశేఖరరావు ఆదేశాలతో 15వ తేదీన జరిగే లోక్‌అదాలత్‌ను సద్వినియోగించుకోవాలని కోరుతూ కొణిజర్ల మండలంలో పోలీసు స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు తదితర చోట్ల కరపత్రాలతో ప్రచారం నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈనెల 15న సత్తుపల్లి, ఖమ్మం, మధిర కోర్టులలో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించడబడుతుందని, రాజీపడదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు రోడ్డు ప్రమాద బీమా కేసుల వారు వినియోగించుకోవాలని కోరారు.

వివరాలను పకడ్బందీగా నమోదు చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటల వివరాలను పూర్తిస్థాయిలో పకడ్బందీగా నమోదు చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ పదిరోజుల నుంచి ప్రచారంలో పాల్గొంటున్న ఎమ్మెల్యే అక్కడి నుంచే నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, సింగరేణి, జూలూరుపాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేంద్ర, తలారి చంద్రప్రకాష్, మంగీలాల్, బ్లాక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల కృష్ణప్రసాద్, ఏదునూరి సీతరాములు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

పనిగంటల పెంపుతో కట్టు బానిసలుగా కార్మికులు

తల్లాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య అనుకూలమైన నాలుగు లేబర్‌కోడ్‌ల ఆర్డినెన్స్ వల్ల పది గంటలపని పెంపు విధానంలో కార్మికులు కట్టుబానిసలుగా మారారని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం తల్లాడలో టీయూసీఐ ప్రాతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీవో నెంబరు 12వల్ల కార్మికులకు వచ్చే ఇన్సూరెన్సులో కోత విధించడం, పూర్తిగా నిరాకరించడం జరుగుతుందన్నారు. పదిగంల పనిపెంపు ఆర్డినెన్సు జీవో నెంబరు 12లను వ్యతిరేకిస్తూ కార్మికులు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకుడు షేక్‌లాల్‌మియా, ప్రాతీయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పటాన్ నాగుల్‌మీరా, డి.శ్రీనివాసరావు, డి.రమణ, సత్యం, రాఘవ, నరేష్, ప్రవీణ్, శ్రీను, రమేష్, రంగారావు తదితరలు పాల్గొన్నారు.

దేవుడి భూముల్లో.. దేవాంతకులు!

(5వ పేజీ తరువాయి)

రెండు ఎకరాల భూమిని 35మంది గ్రామస్థులు ఆక్రమించుకుని ఆవాసాలు నిర్మించుకుని ఉంటున్నారు. అధికారులు కొంత కాలం క్రితం వారినుంచి అద్దెను కూడా వసూలు చేశారు.

ఉక్కుపాదం మోపాల్సిందే..

ఆలయ భూముల రక్షణకు దేవాదాయశాఖ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, కబ్జాలపై ఉక్కుపాదం మోపితేనే స్వాహాపర్వానికి తెరపడుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. భూముల రీసర్వే, భూభారతిలో వివరాల నమోదు, సర్వే మ్యాపులు, పట్టాదారుపాసుపుస్తకాల పునరద్ధరణ, జియోట్యాగింగ్ లాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని ఇతర ప్రజాఉపయోగ నిర్మాణాలు చేపట్టడం ద్వారా భూములకు రక్షణతోపాటు ఆలయానికి ఆదాయం సమకూరుతుందని, ఆ దిశగా దేవాదాయశాఖ ప్రణాళికల రూపొందించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా శ్రీవారి భూములు కబ్జా అంశంపై 'ఆంధ్రజ్యోతి' వివరాలు సేకరించిన సమాచారం తెలుసుకున్న దేవాలయం సిబ్బంది హడావుడిగా దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. ఈనెల 13న శ్రీవారి మాన్యం భూమి సర్వే నిర్వహిస్తున్నామని, సర్వేకి సహకరించాలంటూ శుక్రవారం సరిహద్దు రైతులకు నోటీసులు జారీచేసినట్టు సమాచారం.

దేవాదాయశాఖ నిర్లక్ష్యంతోనే భూములు అన్యాక్రాంతం



ముష్టి కృష్ణభాస్కర్, నర్సింహాపురం

దేవాదాయశాఖ నిర్లక్ష్యంతోనే ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. 1938లో మా తాతయ్య శ్రీవారి ఆలయానికి 10.23ఎకరాలను దానంగా ఇచ్చారు. ప్రస్తుతం రికార్డులో అది 9.13 ఎకరాలుగా ఉంది. మిగిలిన 1.10భూమిరెవెన్యూ ఖాసరా ఖాళీగా ఉన్నా ఇప్పటి దాకా నమోదు చేసుకోలేకపోయారు. భూమి కబ్జాకు గురైందని పలుమార్లు దేవాలయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దాతలకు, దాతల వారరసులకు ఆలయానికి వెళితే సరైన గౌరవం దక్కట్లేదు. ఆలయ అధికారులు, అర్చకుల బాధ్యతారాహిత్యం వల్ల దాతలు వెనక్కి వెళుతున్నారు. అధికారులు, అర్చకుల అనుయాయులకు మాత్రమే గౌరవ మర్యాదలు తప్పా దాతలు, మిగిలిన వారికి స్థానం లేదు. దాతలను ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమిస్తే ఆలయానికి మరింత విరాళాలను సేకరించే అవకాశం ఉంటుంది.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అభివృద్ధికి కృషి

సత్తుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేసేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని ఆసంఘం అధ్యక్షకార్యదర్శులు కేశవరెడ్డి, ప్రకాశరావులు అన్నారు. శుక్రవారం సంఘానికి రూ.15వేల విలువైన మైక్‌సెట్‌ను సీనియర్ నాయకులు మట్టపర్తి సత్యనారాయణ, జీ.జగన్మోహనరావులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా వందేమాతర గీత బృందాలాపన చేసి మహ నీయులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సాంబశివరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, గంగారత్నం, కమలకుమారి, రవిమోహన్, వెంకటేశ్వరరావు, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయండి

పెనుబల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరుగనున్న మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు నరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఆర్ఐసీలో మెరిసిన బాలభారతి విద్యార్థులు

తల్లాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగిన రీడ్ ఇండియా సెలబ్రేషన్ (ఆర్ఐసీ)లో ప్రతిభ కనబరిచి, తల్లాడలోని బాలభారతి విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. సంస్థ వ్యవస్థాపకుడు రఘురాం అనంతోజ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 19రాష్ట్రాలనుంచి విద్యార్థులు పాల్గొనగా 91మంది విద్యార్థులను అంతర్జాతీయస్థాయికి ఎంపికచేయడం జరిగింది. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రంనుంచి 15మంది విద్యార్థులు ఎంపిక కాగా, వీరిలో స్థానిక బాలభారతి విద్యాలయంకు చెందిన 8మంది డి.ఉజ్వల, కె.వైష్ణవి, ఎస్‌కే జవేరియా, ఆర్.శైలజ, ఎస్‌కే సమీహానాహిద్, కె.హితేష్, కె.వేదర్యన్, జి.ప్రణవిలు ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో ఎస్.దామోదరప్రసాద్, కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు అభినందించారు.

తాళ్లపెంటలో వైద్య శిబిరం

పెనుబల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జనజాతీయ గౌరవ దివాస్ 2025లో భాగంగా పెనుబల్లి మండలం తాళ్లపెంటలో లంకాసాగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను వినియోగించుకోవాలి

వేంసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం అందించే రాజీవ్ విద్యా దీవెన ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ తిమ్మిరెడ్డి నాగరాజు కోరారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డితో కలిసి ఈ పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 9, 10వతరగతి విద్యార్థులు ఈ పథకం కింద రూ.3500 ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ల రూపంలో అందిస్తుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

వైరా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైరా సబ్‌స్టేషన్, టౌన్-1 ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ పి.సుందర్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తల్లాడ రోడ్డు, లీలాసుందరయ్యనగర్, మధు విద్యాలయం, బ్రాహ్మణపల్లి అగ్రహారంలోని బోడేపూడి కాలనీ, మధిర రోడ్డు, వాసవీ థియేటర్, సత్రంబజార్, ఎంపీడీవో కార్యాలయం ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ఏన్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏన్కూర మండలం తూతక్కలింగన్నపేట గ్రామానికి చెందిన జనసేనపార్టీ కార్యకర్త పసుపులేటి కృష్ణ ప్రమాదవశాత్తు ఇటీవల మృతిచెందాడు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో వాలంటీర్ బొగ్గారపు శివకృష్ణ చేతులమీదుగా కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాశం భరత్, కొవ్వూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

పెనుబల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రేపు నేలకొండపల్లిలో జరుగనున్నాయని వీటిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెనుబల్లి ఆస్పత్రిలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-కార్మిక వర్గాల కర్తవ్యాలు అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, భారత కార్మిక ఉద్యమ చరిత్రపై రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్.పద్మ, టీయూసీఐ పనివిధానం అనే అంశంపై జిల్లా కార్యదర్శి జి.రామయ్య బోధిస్తారని, ఈ శిక్షణ తరగతుల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గీతామందిరంలో రోహిణీ నక్షత్ర పూజలు

సత్తుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ గీతాజ్ఞానమందిరంలోని శ్రీ పార్థసారథి స్వామివారి దేవాలయంలో శుక్రవారం రోహిణీ నక్షత్ర పూజలు భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాఃవచనం, నవకలశ స్థపనం, స్వామివారికి పంచామృత అభిషేక కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా నేడు ఆలయంతో పాటు ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలలో జరిగేతదియారాధనకు నిరుపేదలు, యాచకులు హాజరై ఆహార పొట్లాలను అందుకోవాలని గీతామందిరం ట్రస్ట్, కార్యనిర్వహణ కమిటీ కోరింది.

చేప పిల్లల పంపిణీ

వేంసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని చెరువులకు చేపపిల్లలను అధికారి జి.శివప్రసాద్ ఎంపీడీవో జి.కావ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీవో రంజిత్‌కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ గొర్ల వెంకటప్పారెడ్డి, వేంసూరు మాజీ సొసైటీ చైర్మన్ వెల్ది జగన్మోహన్ రావు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కందుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటప్పారెడ్డి

వేంసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్పారెడ్డి సూచించారు. శుక్రవారం వేంసూరు మండలం కందుకూరు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని కోరారు. సొసైటీ సీఈవో ఎర్రా గోపిరాజు, సొసైటీ డైరెక్టర్ చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు ఒగ్గు వెంకటేశ్వర్‌రెడ్డి, ఒగ్గు నాగిరెడ్డి, చల్లా చెన్నారెడ్డి, రమేష్‌రెడ్డి, కొప్పుల కృష్ణారెడ్డి, చిల్లపల్లి నాగరాజు, కొక్కెరగడ్డ భీమయ్య, బూర్గు రవి పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తేమ లేకుండా ఎండబెట్టిన ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం భట్టు నాగపుల్లారావు, నాయకులు కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, కిలారు మనోహర్‌బాబు, బండెల నాగార్జున, ఆవుల నాగేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే హత్యలు

- న్యూడెమోక్రసీ ఏపీ కార్యదర్శి మాధవరెడ్డి

చింతకాని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పార్టీలు ఓటమి భయంతోనే హత్యలు చేయిస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యూడెమోక్రసీ కార్యదర్శి గాదె మాధవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో హత్యకు గురైన సీపీఎం రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. 1975 వరకు తాను రామారావు కలసి ప్రజా ఉద్యమాలలో పనిచేశామన్నారు. రైతు ఆత్మహత్యల సందర్భంగా కేంద్ర, రాష్ట్రాల్లో నిర్వహించిన ఆందోళనలో కలసి పనిచేశామన్నారు. రైతాంగ సమస్యలపై ఆయనకు అపార అనుభవం ఉందన్నారు. ఆయన హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు, ఆయన లేని లోటు రైతాంగానికి తీవ్ర నష్టమన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, కొండ్రు జానకిరామయ్య, గడ్డం కోటేశ్వరరావు, కాటబత్తిన వీరబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.